# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 312 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# ఇదే జోష్‌తో పనిచేయండి

## సీఎం, మంత్రులకు అధిష్ఠానం అభినందన

## కరీంనగర్ ఫలితం గురించి మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేతలు



**గత అసెంబ్లీ ఎన్నికల్లో 10వేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట ఇన్‌ఛార్జులను మార్చాలని సూచన**

**సింగరేణి టెండర్ల వ్యవహారంపై ఆరా**

**ఢిల్లీలో ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌లతో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఇతర నేతలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన రెండు అసెంబ్లీ ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ పోరులో పార్టీ మంచి ఫలితాలు సాధించడం పట్ల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తంచేశారు. సీఎం, మంత్రులు, పీసీసీ సహా కష్టపడి పనిచేసిన వారందర్నీ గురువారం అభినందించారు. గత రెండేళ్ల అంశాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించి రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, ..మిగతా 2లో



### సెంటిమెంట్‌ను వాడుకుని

# ఇంకా ఎన్నిరోజులు రాజకీయం

**జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలిచేస్తారు.. సిగ్గుండాలి:**

**కేసీఆర్‌పై కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్య**

**జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్న కడియం శ్రీహరి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకుని ఇంకా ఎన్ని రోజులు రాజకీయం చేస్తారని మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, దేశానికి జాతిపిత ఒకరేనని, అది మహాత్మాగాంధీ అని అన్నారు. తెలంగాణ ఎవరి జాగీరు కాదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ జాతిపిత ఎలా అయ్యారని ప్రశ్నించారు. జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జాతిపిత అయితే ప్రజల్లోకి వచ్చి సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కేసీఆర్ తన హయాంలో అవకతవకలు, అక్రమాలు చేసి కుంభకోణాలలో ఇరుక్కున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే అది కూలిపోయిందని, రాష్ట్రాన్ని దివాలా తీయించారని అన్నారు.




# హైకోర్టులో రేవంత్ క్వాష్ పిటిషన్‌పై విచారణ

**2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డిపై రెండు కేసులు**

**గండ్ర వెంకటరమణారెడ్డి ఫిర్యాదుతో కేసులు నమోదు**

**క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన ముఖ్యమంత్రి**

**కోర్టు హాజరు నుంచి మినహాయించిన హైకోర్టు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

తనపై భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులు కొట్టివేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచార సభలలో తనపై నిరాధార, అనుచిత ఆరోపణలు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేయడంతో రేవంత్ రెడ్డిపై రెండు కేసులు నమోదయ్యాయి. భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం కోర్టులో హాజరునుంచి ముఖ్యమంత్రికి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయడానికి గండ్ర వెంకటరమణారెడ్డి న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

# ఏప్రిల్ నుంచి రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ

**సర్ ప్రక్రియపై ఆయా రాష్ట్రాలకు ఇసి ఆదేశం**

2లో..

# ఏఐ ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ



**ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్‌ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపులు**

**ఇంపాక్ట్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీధర్ బాబు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

కృత్రిమ మేధకు సంబంధించిన నూతన ఆవిష్కరణల వేదికగా నిలుస్తున్న తెలంగాణా రాష్ట్రం అమెరికా పెట్టుబడిదారులకు అనేక అవకాశాలను కల్పిస్తోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతిష్టాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026' లో భాగంగా దేశ రాజధానిలో అమెరికా- ఇండియా వాజిజ్య మండలి ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు.ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యున్నత టెక్నాలిజి ఎకోసిస్టం రాష్ట్రంలో నూతన అవకాశాలను సృష్టించిందని శ్రీధర్ బాబు తెలిపారు. అమెరికా టెక్ దిగ్గజాలతో పబ్లిక్ ప్రేవేట్ భాగస్వామ్యాన్ని ఇప్పటికే తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ముందు చూపుతో కూడిన స్థిరమైన విధానాలు ఏఐ పరిశోధనలకు ఆలంబనగా మారాయని శ్రీధర్ బాబు వివరించారు. ప్రజా సేవలపై రియల్ టైం పర్యవేక్షణతో కృత్రిమ మేధ వినియోగాన్ని పెంచిన విషయాన్ని ఆయన వెల్లడించారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, ..మిగతా 2లో

# కృత్రిమ మేధకు మానవ్ శక్తి




**విలువల వన్నెలద్దుదాం.. డేటా సార్వభౌమత్వాన్ని కాపాడదాం**


**టెక్నాలజీపై మానవ నియంత్రణ అవసరం**

**కృత్రిమ మేధకు ప్రజలు ముడి సరకు కాకూడదు**

**ఏఐ సమిట్ దేశాధినేతల ప్లీనరీలో ప్రధాని మోదీ పిలుపు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

కృత్రిమ మేధలో (ఏఐ) అనైతిక వ్యవహారశైలికి అంతం లేదని, డేటా సార్వభౌమత్వాన్ని కాపాడటానికి, రక్షణ చర్యలు పారదర్శకంగా ఉండటానికి దానికి నైతిక బలమిద్దామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆకాంక్షిత భారత్‌లో అంతర్జాతీయ ఏఐ ప్రయాణం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. 'భారత్ బుద్ధుడి నేల. సరిగా అర్థం చేసుకోవడం ద్వారానే సరైన చర్యలు చేపట్టవచ్చని ఆయన చెప్పేవారు. అందుకే అందరూ కలిసి ఏఐ సరైన ముద్ర వేసేలా రోడ్డు మ్యాప్‌ను సృష్టించాల్సిన అవసరముంది. మనం సరైన ఉద్దేశంతో.. సరైన సమయంలో.. నిర్ణయాలు తీసుకున్నప్పుడే సరైన ..మిగతా 2లో



# 28న బడ్జెట్

**ఈ నెల 26 నుంచి బడ్జెట్ సమావేశాలు**

**23వ తేదీన మంత్రివర్గ సమావేశం**

**10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు**

**మొదటి రోజు గవర్నర్ ప్రసంగం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ..మిగతా 2లో

# ఇదే జోష్‌తో పనిచేయండి

**మొదటి పేజీ తరువాయి...**

మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన పార్టీ అగ్రనేతలు దాదాపు రెండు గంటలు చర్చించారు. ఇప్పటివరకు అన్నీ సానుకూలంగా సాగాయని, ఇకముందు కూడా కష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. తొలుత మంత్రులతో సమావేశమై చర్చించిన అధిష్ఠానం పెద్దలు ఆ తర్వాత ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో విడివిడిగా సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సింగరేణి టెండర్ల వ్యవహారంపై ఆరా తీసినట్లు సమాచారం. అందరితో మాట్లాడిన సందర్భంలో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల అమలు.. సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ గురించి సీతక్క, ధాన్యం కొనుగోలుపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి..భూభారతి, పేదలకు ఇళ్ల నిర్మాణంపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పామాయిల్ తోటల పెంపకంపై తుమ్మల నాగేశ్వరరావు, గిగ్ వర్కర్ల విధానంపై వివేక్ తదితరులు వివరించినట్లు తెలిసింది. గిగ్ వర్కర్ల చట్టం త్వరగా తీసుకురావాలి అని రాహుల్‌గాంధీ సూచించినట్లు సమాచారం. మంత్రులు చెబుతున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని ఈ పథకాల పటిష్ఠ అమలుకు తీసుకొంటున్న చర్యల గురించి మాట్లాడినట్లు తెలిసింది. సమ్మక్క-సారలమ్మ చరిత్ర..ప్రభుత్వం కొత్తగా నిర్మాణాలు చేపట్టి జాతరను విజయవంతంగా నిర్వహించిన తీరు గురించి తెలుసుకొన్న రాహుల్‌గాంధీ... సమ్మక్క-సారలమ్మలపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఓ చిత్రాన్ని నిర్మిస్తే బాగుంటుందని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జాతరను విజయవంతంగా నిర్వహించడంపై ఖర్గే అభినందిస్తూ.. తమనూ పిలిచి ఉంటే వచ్చేవాళ్లం కదా? అని నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు సమాచారం.

మళ్లీ గెలుస్తాం: మహేశ్‌కుమార్‌గౌడ్

సమావేశానంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ అంతర్గతంగా జరిగిన చర్చల సారాంశాన్ని వివరించారు. "జూబ్లీహిల్స్ ఎన్నిక మొదలు, గ్రామపంచాయతీలు, మున్సిపల్ ఎన్నికల్లో



సాధించిన విజయాలను సమీక్షించారు. తాజా ఎన్నికల ఫలితాల పట్ల పార్టీ అగ్రనేతలు సంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 80% మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారు... మున్సిపల్ ఎన్నికల ఫలితాలు దాన్ని ప్రతిబింబించాయి అని ఖర్గే చెప్పారు" అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మార్చి రెండోవారానికల్లా నామినేటెడ్ పదవులు, మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలు భర్తీచేస్తామని విలేకర్ల ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

రాజగోపాల్‌రెడ్డితో అధిష్ఠానం మాట్లాడుతుంది

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇటీవల పార్టీ, సీఎంపై చేసిన వ్యాఖ్యల గురించి విలేకర్లు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "ఆయనపై కూడా చర్చ జరిగింది. త్వరలో అధిష్ఠానం పిలిచి మాట్లాడుతుంది" అని పేర్కొన్నారు. రాజ్యసభ ఎన్నిక అంశంపైనా మాట్లాడారని, రెండుమూడు రోజుల్లో ముఖ్యమంత్రిని, నన్ను పిలిచి మరోమారు మాట్లాడతామని అధిష్ఠానం పెద్దలు చెప్పినట్లు పీసీసీ అధ్యక్షుడు తెలిపారు. మంత్రివర్గంలో మిగిలిన ఖాళీల భర్తీ అంశం చర్చకు రాలేదన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్న కేటీఆర్ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసిపోమన్నారు. 6 హామీల్లో అత్యధికం అమలు చేస్తున్నామని, ఇంకా మూడేళ్ల సమయం ఉన్నందున ఆలోపు అన్నీ అమలుచేసి శభాష్ అనిపించుకొని మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తంచేశారు.

ఫాంహౌస్ రాజకీయాలు చేయడంలేదు: మంత్రి పొన్నం

రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీకి రావడంపై భారాస చేసిన ఆరోపణలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. "ఫాంహౌస్ నుంచి పరిపాలన చేస్తే కాని తప్పు.. జాతీయపార్టీ నాయకత్వాన్ని కలిస్తే ఎలా తప్పవుతుంది? మేం కాంగ్రెస్ పార్టీ నాయకులం. అందువల్ల ఏఐసీసీ అధ్యక్షుడికి పిలిచి మాట్లాడే హక్కుంటుంది. మమ్మల్ని తప్పుపడుతున్న భారాస ఢిల్లీలో పార్టీ కార్యాలయం కోసం ఎందుకు స్థలం తీసుకొంది? ప్రాంతీయ పార్టీకి ఇక్కడేం పని ఉందో సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు.

సమ్మిళిత తెలంగాణ కోసం నిరంతర కృషి: ఖర్గే

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించడానికి కారణాలను రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ వివరించారు. భారాస, భాజపాలు ఎలా బలహీనపడ్డాయో చెప్పారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో పనిచేయడంవల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. దాని పట్ల ఖర్గే, రాహుల్‌గాంధీలు సంతృప్తి వ్యక్తంచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 10వేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల ఇన్‌ఛార్జులను మార్చాలని, పార్టీని బలోపేతం చేయాలని సూచించినట్లు సమాచారం. కరీంనగర్ కార్పొరేషన్ ఫలితం గురించి కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించినట్లు సమాచారం. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులు వివరణ ఇచ్చినా సంతృప్తి చెందలేదని తెలిసింది. ఇంకా సమావేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలవడం, సమీకృత పాఠశాలల గురించి చర్చ జరిగింది. "తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించిన అనంతరం తెలంగాణ విజన్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు రాష్ట్ర నాయకులు, మంత్రులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించాం. ప్రజలందరి ఆశయాలు నెరవేర్చడానికి, సమ్మిళిత తెలంగాణ నిర్మాణం కోసం నిరంతరం కృషిచేస్తూనే ఉంటాం" అని సమావేశానంతరం ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు.




## చత్రపతి శివాజీ ధైర్యసాహసాల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**

చత్రపతి శివాజీ స్ఫూర్తితో యువత దేశ అభివృద్ధిలో ముందుకు సాగాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వెంకటాపురం డివిజన్ ఇంద్రనగర్ లేబర్ అడ్డా వద్ద శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహారాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ధైర్యసాహసాలకు, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన చత్రపతి శివాజీ మహారాజ్ జీవితం, ఆలోచనలు, పరిపాలనా దూరదృష్టి యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశభక్తి, న్యాయపాలన, ప్రజాహితమే మహారాజ్ లక్ష్యమని, ఆ ఆదర్శాలను నేటి తరాలు ఆచరణలో పెట్టాలని కోరారు. శివాజీ సేవా సమితి సభ్యులు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని ప్రతి ఆదివారం వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు, బస్ స్టాప్‌లు, వివిధ ప్రదేశాలలో స్వయంగా వండి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. వారి సేవాభావాన్ని కొనియాడుతూ సమితి సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేవా సమితి సభ్యులు రవి నాయక్, గోపాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శివారం నాయక్, తిరుపతి నాయక్, తులసి రామ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు సురేష్, శ్రీనివాస్, లక్ష్మణ్ యాదవ్, పవన్, జమ్మిదార్ ముత్యాలు, రాజు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## 28న బడ్జెట్

**మొదటి పేజీ తరువాయి...**



బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 23వ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాల తేదీని ప్రకటించనున్నారు. పది నుంచి పదిహేను రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా మంత్రులు, అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను స్వీకరించారు.

## ఏఐ ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి...**

పట్టణాభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించిన ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ఎఐ రంగంలో అగ్రగామిగా నిలబెట్టింది. కృత్రమ మేథ ఆవిష్కరణలకు ప్రపంచంలోనే ఒక ముఖ్య కేంద్రంగా నిలబడేలా తెలంగాణాను తీర్చుదిద్దు తున్నామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు వెల్లడించారు. వేగంగా దూసుకుపోతున్న టెక్నాలజి ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ సంకల్పం అని ఆయన అన్నారు. ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్ ల ఏర్పాటు, ప్రతిభావంతులతో కూడిన స్కిల్ ఫోర్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో అత్యంత ప్రాధాన్యతనిస్తాం అని వెల్లడించారు.

# కృత్రిమ మేధకు మానవ్ శక్తి

**మొదటి పేజీ తరువాయి...**

ఫలితం కనిపిస్తుంది' అని మోదీ స్పష్టం చేశారు. ఇండియా ఇంపాక్ట్ సమిట్‌ను గురువారం ఢిల్లీలోని భారత మండపంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ సక్రమ వినియోగానికి 'మానవ్' విజన్‌ను ఆవిష్కరించారు.

అనంతరం దేశాధినేతల ప్లీనరీలో ప్రసంగించారు. వేగంగా ఎదుగుతున్న ఏఐ టెక్నాలజీని ప్రజలే కేంద్రంగా ఉపయోగించుకునే వ్యవస్థలను తయారు చేయాలని, సార్వభౌమత్వం, సమ్మిళితత్వాలను గౌరవిస్తూ ఉపయోగించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఏఐ నైతికతలో కంపెనీలకు బాధ్యత ఉందని పేర్కొన్నారు. కొన్ని దేశాలు ఏఐని రహస్యంగా భావిస్తున్నాయని, కానీ దానిని అందరితో పంచుకుని ప్రపంచం మంచి కోసం ఉపయోగించాలని భారత్ భావిస్తోందని తెలిపారు.

ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా సహా పలు దేశాధినేతలతో ప్రధాని మోదీ


ఏఐకి భారత్ భయపడదు

ఏఐకి భారత్ భయపడబోదని ప్రధాని స్పష్టం చేశారు. దానిని షేర్ చేసుకోవడం, ఓపెన్ కోడ్‌ల ద్వారా ప్రపంచానికి మంచి చేసేలా ఉపయోగించుకోవచ్చని నమ్ముతున్నామని తెలిపారు.

ఏఐ విషయంలో సంక్షేమం, సంతోషం తమ బెంచ్‌మార్క్ అని, వీటికి భరోసా కల్పించడంలో ప్రజలు ఏఐకి డేటాగా, ముడి సరకుగా ఉండకూడదని స్పష్టం చేశారు.

టెక్నాలజీపై మానవ నియంత్రణ ఉండాలని ప్రధాని స్పష్టం చేశారు. ఉదాహరణకు జీపీఎస్‌నే తీసుకుంటే.. అది ఎటు వెళ్లాలో సూచిస్తుందని, తుది నిర్ణయం మాత్రం మనమే తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

'ప్రస్తుతం ఏఐని చూసి భయపడేవారు కొందరైతే.. దానిని అదృష్టంగా భావించేవారు మరికొందరు. భారత్



ఇందులో అదృష్టాన్ని, భవిష్యత్తునే చూస్తోంది' అని ప్రధాని స్పష్టం చేశారు.

పాఠశాలల సిలబస్‌ను రూపొందించినట్లే ఏఐని పిల్లలకు సురక్షితంగా ఉండేలా చూడాలని మోదీ అభిప్రాయపడ్డారు. అది కుటుంబానికి దారి చూపేలానూ ఉండాలని స్పష్టం చేశారు.

**చెల్లింపుల గతిని మార్చిన యూపీఐ**

దేశంలో యూపీఐ చెల్లింపుల సమర్థతను మోదీ ప్రస్తావించారు. క్లిష్ట సమయాల్లోనూ ప్రజలు సులభంగా చెల్లింపులు జరిపేలా భారత్ యూపీఐ ద్వారా భరోసా కల్పించిందని, డిజిటల్ అంతరాలను తొలగించిందని వివరించారు.

ఇటీవలి సంవత్సరాల్లో మేం శక్తిమంతమైన డిజిటల్ ప్రజామౌలిక సదుపాయాల వ్యవస్థను నిర్మించామని, ఎందుకంటే టెక్నాలజీని శక్తిమంతమైన పరికరంగా కాకుండా.. సేవలకు మాధ్యమంగా వినియోగించుకుంటున్నామని ప్రధాని తెలిపారు.

**సదస్సులో మోదీ, మెక్రాన్ మంతనాలు**

టెక్నాలజీ, మానవత్వం మిళితం కావాలి: మెక్రాన్

ఏఐ సమ్మిళిత అభివృద్ధి కోసం టెక్నాలజీ, మానవత్వం మిళితం కావాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ పేర్కొన్నారు. ప్రస్తుతం భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని డిజిటల్ టూల్స్‌కు మార్గదర్శకత్వం కోసం సమగ్ర విధానం కావాలని పిలుపునిచ్చారు. భారత్, ఫ్రాన్స్ కలిసి ఏఐ ఫ్రేమ్‌వర్క్ కోసం ఉమ్మడిగా పని చేస్తాయని చెప్పారు. ఏఐ సమిట్ ప్లీనరీలో మెక్రాన్ ప్రసంగించారు. 10 ఏళ్ల కిందట ముంబయిలోని వీధి వ్యాపారులు బ్యాంకు ఖాతాలు తెరవడం సాధ్యమయ్యేది కాదని, ప్రస్తుతం వారే తమ ఫోన్ల ద్వారా చెల్లింపులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఇది టెక్నాలజీ స్టోరీయే కాదని, నాగరికత స్టోరీ అని వివరించారు. ఏ దేశమూ సాధించలేని డిజిటల్ గుర్తింపును భారత్ సాధించిందని తెలిపారు.

**గుటెరస్ సహా పలువురి హాజరు**

ఏఐ సమిట్ ప్లీనరీకి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఫ్రాన్స్, బ్రెజిల్, స్విట్జర్లాండ్, శ్రీలంక, సెర్బియా, ఎస్తోనియా అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, లూయిజ్ ఇనాషియో లూలా డ సిల్వా, గయ్ పర్మెలిన్, అనుర కుమార దిసనాయకే, అలెగ్జాండర్ ఉసిక్, అలార్ కరిస్, భూటాన్, మారిషస్, క్రోయేషియా, ఫిన్లాండ్ ప్రధానులు షెరింగ్ తొబ్గే, నవీన్‌చంద్ర రాంగులాం, ఆండ్రెజ్ ప్లెంకోవిక్, పెటెరి ఆర్పో. సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లైతోపాటు అగ్రశ్రేణి కంపెనీల సీఈవోలు హాజరయ్యారు.

ఏఐ సమిట్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. ఏఐపై దేశ దూరదృష్టిని, బాధ్యతను ఈ ప్రసంగం ప్రతిబింబించిందని పేర్కొన్నారు.

**11 భాషల్లో ప్రధాని ప్రసంగం**

మోదీ ప్రసంగం సందర్భంగా ఏఐలో భారత్ పురోగతి ఆవిష్కృతమైంది. ఆయన ప్రసంగాన్ని రియల్‌టైమ్‌లో 11 భాషల్లో అనువదించారు. సంజ్ఞల భాషలోనూ ప్రదర్శించారు. ప్రధాని ప్రసంగాన్ని తెలుగు, తమిళం, అస్సామీస్, బంగ్లా, ఆంగ్లం, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ భాషల్లోకి అనువదించారు.

## తెలంగాణ ఇంటర్ హాల్ టిక్కెట్లు విడుదల

### మార్చిలో జరుగనున్న పరీక్షలకు ఏర్పాట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హాల్ టికెట్ల ప్రక్రియ పూర్తయింది. మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో, బోర్డు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే, విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయంతో పాటు, వారి సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్ల నుండి ధ్రువీకరించిన హాల్ టికెట్లను తీసుకోవాలని బోర్డు సూచించింది. విద్యార్థుల సౌకర్యార్థం వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే లింక్‌ను కూడా పంపుతున్నారు. ఈసారి సాంకేతికతను జోడిస్తూ బోర్డు కీలక మార్పులు చేసింది. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా , ఖచ్చితంగా గుర్తించడానికి వీలుగా హాల్ టికెట్లపై కోడ్ ను ముద్రించారు. దీనిని స్కాన్ చేయడం ద్వారా సెంటర్ లొకేషన్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఒకవేళ హాల్ టికెట్‌లో పేరు, ఫోటో, సంతకం లేదా సబ్జెక్టులకు సంబంధించి ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు హెచ్చరించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హాల్ టికెట్లు అందిన వెంటనే అన్ని వివరాలు సరిచూసుకోవడం, పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందే సందర్శించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నుంచే ప్రారంభం కానున్న ఈ వార్షిక పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా వందలాది కేంద్రాలను సిద్ధం చేశారు.

## ఏప్రిల్ నుంచి రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ

### సర్ ప్రక్రియపై ఆయా రాష్ట్రాలకు ఇసి ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**



పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు పలు రాష్ట్రాలప్రధాన ఎన్నికల అధికారులకు అత్యవసరంగా లేఖలు రాసింది. ఏప్రిల్ నుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ పక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 20కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ / కాశ్మీర్, లడఖ్, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ ఉన్నాయి. సర్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఆయా రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులు వీలైనంత త్వరగా సన్నాహకాలను పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు


మైలార్ దేవుపల్లి శివాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్


అత్తాపూర్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జరిగిన ఊరేగింపు లో పాల్గొన్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి


బృందావన్ కాలనీ లో శివాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి



రాజేంద్రనగర్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, జి బాబురావు, పి రవీందర్ తదితరులు

రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిళ్లలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవలను కొనియాడారు.

బుద్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)



అత్తాపూర్ లో శివాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెంద్యాల సాయి మల్లిక్

# భవాని కాలనీ సమస్యలు పరిష్కరించాలి

**కాలనీ మాజీ అధ్యక్షులు గోల్కొండ యాదయ్య**

**కాలనీలో ప్రధాన రహదారిపై ఫుట్ పాత్ ల ఆక్రమణలను తొలగించాలి**

**రాజేంద్రనగర్ ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవాని కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కాలనీ మాజీ అసోసియేషన్ అధ్యక్షులు గోల్కొండ యాదయ్య అధికారుల ను కోరారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పలు సమస్యలను అధికారులకు విడుదల చేశారు. కాలనీలో రోడ్లన్నీ అయోమయంగా తయారయ్యాయని ఈ విషయంపై గతంలో మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే విన్నవించడం జరిగిందన్నారు. ఫుట్ పాతుల ఆక్రమణతో సీనియర్ సిటిజన్స్ రోడ్లపై నడవలేక పోతున్నారు. రోడ్లపై గుంతలు అడుగడుగున పడటంతో పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొందని ఆయన గుర్తు చేశారు. కాలనీలో ఏ రోడ్డు చూసిన రోడ్డు గుంతల భయంగా మారిందని ఆయన వాపోయారు. 15 సంవత్సరాల కింద మా కాలనీ రోడ్ వేశారని గుర్తు చేశారు. జాలిగం సత్యనారాయణ మున్సిపల్ చైర్మన్ గా ఉన్న కాలంలో రోడ్లు వేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ గా పనిచేసిన ప్రజా ప్రతినిధులు మా కాలనీ సమస్యలు పట్టించుకోవటం లేదని ఆయన ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ ఒకసారి పర్యటిస్తే రోడ్లు ఏ విధంగా ఉన్నాయో తెలుస్తుందన్నారు. ప్రధాన రహదారి కబ్జా గురి అయినవి రోడ్డు ఇరుపక్కల రోడ్డు సామాన్లు పెట్టుకోవడం వల్ల పాదచారులకు చాలా ఇబ్బందిగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఆడపిల్లలు ,పెద్దలు , నడుచుకుంటే వచ్చే పరిస్థితులు లేవన్నారు. భవాని కాలనీలో ఉన్న బస్టాండ్ కబ్జా గురైందన్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని మాకు రోడ్లు నిర్మించాలని, బస్టాండ్ కబ్జాన్ తొలగించాలని ఆయన కోరారు.



# మచ్చ బొల్లారం ఆర్‌యుబి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**

మచ్చ బొల్లారం ఆర్‌యుబి నిర్మాణ పనులు త్రిక నా పూర్తి చేయాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మర్రి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన మచ్చ బొల్లారం రైల్వే గేటు ఎల్ సి -250 వద్ద ఆర్‌యుబి (రైల్వే అండర్ బ్రిడ్జ్ ) నిర్మాణానికి సంబంధించి అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు.మచ్చ బొల్లారం రైల్వే గేటు వద్ద తరచుగా ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ , ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌యుబి నిర్మాణం అత్యవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్‌యుబి నిర్మాణం పూర్తయితే సమయభావం తగ్గి, ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పట్టి, స్థానిక ప్రజలకు మరియు ప్రయాణికులకు పెద్దఎత్తున ఉపశమనం కలుగుతుందని తెలిపారు. భూసేకరణ, సర్వే, సాంకేతిక అంశాలు , శాఖల సమన్వయం విషయాలపై సంబంధిత అధికారులతో సవివరంగా చర్చించారు. పనులు వేగవంతంగా ప్రారంభమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రైల్వే ల్యాండ్ ఆక్విజిషన్ అధికారి శేషాచారి, రైల్వే సెక్షన్ ఇంజనీర్ సామ్రాట్ రాయ్, అల్వాల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్లు, అల్వాల్ డిప్యూటీ తహసీల్దార్ పృథ్వి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు, హెచ్ఆర్‌డీసీఎల్ డి.ఈ. అరవింద్ కుమార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. శ్రీనివాసులు, మేడ్చల్ జిల్లా డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కె. శ్రీనివాసాచారి, జలమండలి డీజీఎం సాంబయ్య, మచ్చ బొల్లారం కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.మచ్చ బొల్లారం అభివృద్ధి పనుల పట్ల ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.

# చేష్టలుడిగి చూస్తున్నారు...!

**పటాన్ చెరు లో రోజు రోజుకూ పట్టు కోల్పోతున్న 'హస్తం'!**

**మున్సిపల్ ఎన్నికలపై లేని నజర్...**

**అందుకే పాంచ్ పటాకా మిస్ ఫైర్...**

**పేరుకు మాత్రమే అధికార పార్టీనా...?**

**పెత్తనం అంతా ప్రతిపక్షానిదేనా...!**

**ద్వితీయ శ్రేణి నేతల్లో నైరాశ్యం..!**

**జిహెచ్ఎంసి ఎన్నికలకైనా.. అవుతారా సమాయత్తం...?**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):**






సమన్వయ లోపం పార్టీ భవిష్యత్తుకు శాపంగా మారుతోంది. పేరుకు మాత్రమే అధికార పార్టీ కానీ పెత్తనం అంతా ప్రతిపక్షానిదే అన్నట్లు ఉంది పటాన్ చెరు నియోజకవర్గంలోని పరిస్థితి. ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో ఐదు మున్సిపాలిటీలు ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం అన్నీ బీఆర్ఎస్ ఖాతాలో పడ్డాయి. గడ్డపోతారంలో 14/18 వార్డులు, గుమ్మడిదలలో 15/22 వార్డులు, ఇంద్రేశంలో 9/18 (ఇండిపెండెంట్ మద్దతుతో), జిన్నారంలో 8/20 (బీజేపీతో పొత్తు), ఇస్నాపూర్‌లో 12/26 (ఎక్స్-ఆఫీసియో, ఇండిపెండెంట్ల సాయంతో) బిఆర్ఎస్ అన్ని చైర్‌పర్సన్ పదవులు కైవసం చేసుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూపంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇంత ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఇది సాధారణ ఓటమి కాదు. ఈ దుస్థితికి కారణం పార్టీ పెద్దలు చేతులు కట్టుకొని చూస్తున్నట్టు కనిపిస్తోంది . మున్సిపల్ ఎన్నికలపై సరైన దృష్టి పెట్ట లేకపోవడం, అంతర్గత వర్గపోరు, ఎమ్మెల్యే స్వయంగా "కాంగ్రెస్‌లో చేరడం తప్పు" అని కార్యకర్తల సమావేశంలో అనడం ఇవన్నీ కలిసి పార్టీని కుదిపేశాయి. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడానికి ప్రజలు వెనకడుగు వేసారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ పార్టీ చైర్పర్సన్ స్థానాలు సొంతం చేసుకుంది.

**కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ఎవరి దారి వారిది**

పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ లో నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఇందులో పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త కాటా శ్రీనివాస్ గౌడ్ ది ఓ వర్గం కాగా,మెదక్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త నీలం మధు ముదిరాజ్ ది రెండో వర్గం. దీంతో ఒకరి మీద ఒకరికి గిట్టని పరిస్థితి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ లోకి వచ్చినా ఆయన రాకతో కాంగ్రెస్‌లో 'కంఫర్ట్' లేదని, కాటా మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. నీలం మధు ముదిరాజ్ కూడా సొంత బలం మీదనే ఆధారపడుతున్నారు. పంచాయితీ, మున్సిపల్ పార్టీ టికెట్ల కేటాయింపు వేళ కూడా ఒక్కటై పని చేయలేదు. ఫలితంగా ఓట్లు చీలిపోయి బిఆర్ఎస్ ఒక్కటే లాభపడింది. ఈ పరిణామాలతో ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు నైరాశ్యంలో మునిగిపోయారు."పై నుంచి సపోర్ట్ లేదు, క్రింద నుంచి యూనిటీ లేదు..ఇలా చేస్తే ఎలా గెలవాలి?" అని పలు సందర్భాల్లో వాపోయారు. రాష్ట్రంలో అధికారం ఉన్నా, రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు,స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, ఉద్యోగాలు ఏవీ పటాన్ చెరు ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా చేరుతున్నట్టు కనిపించడం లేదు. బిఆర్ఎస్ మాత్రం హరీష్ రావు నాయకత్వంలో ప్రజల్లో బలం పెంచుకుంటోంది.

**ఇక్కడ ఏం జరుగుతుందంటే...?**

పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకూ పట్టు కోల్పోతున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. ద్వితీయ శ్రేణి నాయకుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. పార్టీ ముఖ్య నేతలు ద్వితీయ శ్రేణి నాయకులను, కార్యకర్తలను నమ్మకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పార్టీ ముఖ్య నేతలకు కలుపుకు పోవడంలో మెలుకువలు లేకపోవడం ఈ పరిస్థితికి కారణంగా చెప్పుకోవచ్చు. వర్గ పోరును అరికట్టడంలో ముఖ్య నేతలు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వయంగా "కాంగ్రెస్ లో చేరి తప్పు చేశా" అని అంటున్నప్పుడు, కార్యకర్తలు ఏం చేస్తారు? సందిగ్ధత తో కొట్టుమిట్టాడుతుంటారు. ఇప్పటికైనా వర్గపోరును అరికట్టకపోతే, రాబోయే ఎన్నికల్లో పార్టీకి మరిన్ని షాకులు ఎదురవ్వడం ఖాయం. ప్రతిపక్షం బలపడుతున్నా, అధికార పార్టీ చేతులు కట్టుకొని చూస్తే... ప్రజలు ఏం అనుకుంటారు? ఎలాంటి సంకేతాలు పోతాయి..!

పటాన్ చెరు కాంగ్రెస్ నేతలు ఇంకా ఆలస్యం చేస్తే."పేరుకు మాత్రమే అధికార పార్టీ" అన్న ముద్ర బలపడిపోతుంది. బల్దియా ఎన్నికలు ముగిశాయి కానీ, రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో, మిగతా స్థానిక సమస్యల్లోనూ ఇదే స్థితి కొనసాగితే... హస్తం చిహ్నం కూడా " మిస్ ఫైర్" అయ్యే ప్రమాదం ఉంది!



# హిందూ ధర్మాన్ని, దేశ గౌరవాన్ని కాపాడిన గొప్ప దేశభక్తుడు చత్రపతి శివాజీ:

**కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్**

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**

హిందూ ధర్మాన్ని, దేశ గౌరవాన్ని కాపాడిన గొప్ప దేశభక్తుడు చత్రపతి శివాజీ అని కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ కొనియాడారు. గురువారం మైలార్ దేవుపల్లి, బృందావన్ కాలనీ లలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులకు ఎస్ వెంకటేష్ నివాళులర్పించారు.చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమం లో వెంకటేష్ తో పాటు బీఆర్ఎస్ నాయకులని శివాజీ అసోసియేషన్ కాలనీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.. జై భవానౌ జై శివాజీ! అనే నినాదంతో కాలనీలు మారు మ్రోగిపోయినాయి .ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ... చత్రపతి శివాజీ ధైర్య సాహసాలు యుగయుగాల పాటు ప్రేరణగా నిలుస్తుంది అని కొనియాడుతూ, శత్రువులపై సాహసోపేతంగా పోరాడుతూ, ప్రజల సంక్షేమాన్ని రాజధర్మంగా భావించిన ఆదర్శ పాలకుడ చత్రపతి శివాజీ మహారాజ్ అని తెలిపారు .రాజ్య పరిపాలనలో న్యాయం, సమానత్వం, మహిళల గౌరవం, సైనిక శక్తి ం ఈ సూత్రాలతో ఆయన నిర్మించిన స్వరాజ్యం భారత చరిత్రలో సువర్ణ అధ్యాయం అన్నారు . ఈ కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, రఘు యాదవ్ ,రాజేష్ యాదవ్, కొంపల్లి జగదీష్, గుమ్మడి కుమార్, బాల్ రాజ్ యాదవ్, జి రాజు, ఈర్లపల్లి ప్రవీణ్ ,నరేష్ యాదవ్ ,కృష్ణ ముదిరాజ్ ,యెగె మహేష్ కురుమ, వెంకటరమణ కురుమ ,అశోక్ కుమార్ కురుమ, కృష్ణ ముదిరాజ్, శేఖర్, ముందు చారి, హంగాద్ ,లోకేష్, శివాజీ మహారాజ్ అసోసియేషన్ కార్యనిర్వహణ సభ్యులు దయానంద్ ,సతీష్, జయరాం, గణేష్ ,కేశవ్ ,గుణవంత్రావ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, శివాజీ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి శోభాయాత్ర

**పటాన్ చెరు, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):**

పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని బొల్లారం డివిజన్ పరిధిలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. బొల్లారం హనుమాన్ మందిరం నుండి కొత్త బస్టాండ్ వరకు ఈ శోభా యాత్ర కొనసాగింది. బిజెపి పట్టణ అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు. బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి శోభాయాత్ర ఆద్యంతం ఎలాంటి ఇబ్బందీ కలగకుండా పర్యవేక్షించారు.



# యువతకు ఆదర్శం పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్: వనపర్తి నాగేష్

**పటాన్ చెరు, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):**

దేశం కోసం వీరోచిత పోరాటం చేసిన యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని వనపర్తి నాగేష్ స్మరించుకున్నారు. ఛత్రపతి శివాజీ 396 వ జయంతి సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని బొల్లారం డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వనపర్తి నాగేష్ పాల్గొని ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు చిత్రపతి శివాజీ ధైర్య సాహసాలు, దేశభక్తి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో, జంగన్న, యశ్వంత్, కాశీనాథ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యల పరిష్కార లక్ష్యమే జలమండలి.. బస్తీ బాట..!

**ప్రజలతో మమేకమవడానికి వినూత్న కార్యక్రమం**

**శుక్రవారం నుంచి ప్రారంభం.. వారానికి 4 రోజులు**

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు నిర్ణయం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**



జలమండలి బోర్డు పరిధి కోర్ అర్బన్ రీజయన్ వరకు పరిధి పెరగడంతో వాటర్.. సీవరేజ్ సేవలు మరింత సమర్ధవంతంగా అందించే విధంగా స్థానికంగా నెలకొన్న సమస్యలు గుర్తించి వాటిని అధిగమించడంతో పాటు ప్రజల నుంచి సమస్యలు తెలుసుకునే విధంగా 'జలమండలి.. బస్తీ బాట' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు రూపొందించిన ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ నుంచి వార్డు మేనేజర్ల వరకు భాగస్వామ్యులుగా ఉంటారు.

**వారంలో నాలుగు రోజులు:**

జల మండలి పరిధిలోని బస్తీ, కాలనీలలో ప్రతి మంగళవారం, బుధవారం, శుక్రవారం, శనివారం ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు మేనేజింగ్ డైరెక్టర్ నుంచి వార్డు మేనేజర్ల వరకు పర్యటిస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కార్యాలయంలో యధావిధిగా అందుబాటులో ఉంటారు. క్షేత్ర స్థాయిలో ఎండీ నుంచి వార్డు మేనేజర్ల వరకు పర్యటించి, మంచినీరు, సీవరేజీ సమస్యలు గుర్తించి, ప్రజలతో మాట్లాడి, సమస్యలు తెలుసుకొని, తాత్కాలిక సమస్యలు తక్షణమే పరిష్కారించి, శాశ్వత పరిష్కారం కోసం వార్డుల వారిగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. బస్తీలో పర్యటన తీరును పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్, జాయింట్ ఎండీ, డైరెక్టర్లు, రీజియన్ ఈడీలు, డైరెక్టర్ (ఆపరేషన్)లు, జోన్ సీజీఎం, జనరల్ మేనేర్లు, సర్కిల్ డీజీఎం వరకు వారి పరిధిలో అకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. సమస్యల పరిష్కరానికి ప్రజలతో మమేకం అవుతారు.

**క్షేత్రస్థాయి పర్యటనలో ప్రాధాన్యత ఇలా..**


సీవరేజీ మ్యాన్ హోల్స్, పైప్‌లైన్ పరిస్థితి, లీకేజీ, ఓవర్ ఫ్లో, డీసిల్టింగ్ పరిశీలన.. సత్వర చర్యలు చేపడతారు. వాటర్ పైప్‌లైన్, లీకేజీలు, నీటి సరఫరాలో సమయ పాలన, నీటి వృధా, లో-ప్రెషర్, నల్లలకు మోటర్ల బిగింపు, సరఫరా అవుతున్న తాగు నీటి నాణ్యత పరిశీలించి.. సత్వర చర్యలు తీసుకుంటారు. అలాగే నివాసాల్లో భూగర్బజలాల పెంపు కోసం ఇంకుడు గుంతలు, ఇంజక్షన్ బోర్‌వెల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

**డైలీ రిపోర్టు:**

ప్రతి వార్డు మేనేజర్ పర్యటన రోజుకు సంబంధించి గుర్తించిన సమస్యలు, తాత్కాలిక పరిష్కారాలు, శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక ప్రతిపాధనలు రూపొందించి ఆన్‌లైన్ యాప్‌లో సర్కిల్ డీజీఎంలకు, సర్కిల్ డీజీఎంలు సర్కిల్ వారిగా జోన్‌లకు, జోన్ నుండి జోన్‌ల వారిగా రీజియన్‌కు, రీజియన్ నుంచి కేంద్ర కార్యాలయాన ఆన్‌లైన్ నివేదికలు సమర్పిస్తారు. ప్రతి వారం పర్యటనపై శనివారం సమీక్షా సమేవేశం నిర్వహిస్తారు.

**రేపటినుంచే.. జలమండలి బస్తీ బాట:**

రేపటి (శుక్రవారం) నుంచి 'జలమండలి బస్తీ బాట' కార్యక్రమం ప్రారంభింస్తారు. ప్రజల్లో జలమండలిపై మరింత నమ్మకం కలిగించే విధంగా క్రార్యక్రమాన్ని రూపొందించారు.



## చత్రపతి శివాజీ మహారాజ్ యావత్ భారతదేశానికి సామూహ శక్తి

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

ఛత్రపతికి శివాజీ మహరాజ్ జయంతి సందర్బంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎం టి ఆర్ నగర్, ఎల్లమబండ, శంశిగుడా, మహనకలినగర్ లో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ ముఖ్య అతిథిగా హాజరై చత్రపతి విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్బంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ ఛత్రపతికి శివాజీ మహరాజ్ యావద్ భారతదేశ సమూహ శక్తిగా కొలవడం జరుగుతుందని, ఆయన రాజ్యంలో సుపరిపాలన అందించడమేకాక రాజ్యంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందువరుసలో ఉండి పరిష్కరించేవాడని, ఆయన పేరు చెబితేనే శత్రువుల వెన్నులో వణుకు పుట్టేది అని వారు అన్నారు. అలాగే మనమందరం ఆయనకు ఆదర్శనంగా తీసుకొని ప్రజలకు ఏ ఇబ్బంది ఉన్నా వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చత్రపటి శివాజి యూత్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుల మతాలకతీతం చత్రపతి శివాజీ తత్వం

**హిందూ ధర్మ పరిరక్షణ కోసం**

**చత్రపతి శివాజీ చేసిన ధైర్యం పోరాటం నేటి యువతకు స్ఫూర్తి**

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**



కుల, మత ప్రాంతాలకు అతీతం శివాజీ తత్వమని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బాలానగర్ కు చెందిన జై శ్రీరామ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బాలానగర్ చౌరస్తా వద్ద నూతనంగా శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ అనంతర కాలంలో ధర్మం కోసం జరిగిన పోరాటాలకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. భారతదేశ చరిత్రలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం చత్రపతి శివాజీ చేసిన ధైర్యం పోరాటం సాహసం నేటి యువతకు స్ఫూర్తిగా కొనసాగుతున్నాయన్నారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. నిర్వాహకులను రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పులి శివకుమార్ గౌడ్, మాదిరెడ్డి యుగేందర్ రెడ్డి, ఆకుల నరేందర్ ముదిరాజ్, పుష్ప రెడ్డి, పులి శ్రీకాంత్ పటేల్, గోపిశెట్టి రాఘవేందర్, సతీష్ గౌడ్, శివ చౌదరి, జై శ్రీరామ్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే

## మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు

**బిఆర్ టియు కార్మిక నాయకుడు రవి ఆధ్వర్యంలో శివనంద రెహబిలిటేషన్ హోమ్ హాస్పటల్లో అన్నదాన కార్యక్రమం**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

జన హృదయనేత, డైనమిక్ లీడర్, ప్రియతమా నాయకులు, హ్యాట్రిక్ ఎమ్మెల్యే పేదలంటే ప్రాణం ఇచ్చే నాయకుడు, పేదలకు ఏ ఆపద వచ్చిన ఆపద్బాంధవుడు లాగా అండగా ఉంటూ కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలని తన సొంత కుటుంబ సభ్యులుగా చూస్తూ ఎవరికీ ఏ కష్టం రాకుండా ఉంటున్న బడుగు, బలహీన వర్గాల జరిపారు. మాధవరం కృష్ణారావు జన్మదినోత్సవం సందర్భంగా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ఆధ్వర్యంలో కూకట్ పల్లి "శివనంద రెహబిలిటేషన్ హోమ్ హాస్పటల్లో " రోగులకు అన్నదాన కార్యక్రమం, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, మహిళామణులు, కార్యకర్తలు, అభిమానులు రవి మిత్రబృందం అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



## అన్నరాజ్ నూతన గిఫ్ట్ షాపును ప్రారంభించిన పిఎసి చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్ నగర్ డివిజన్ పరిధిలోగల అడ్డగుట్ట మెయిన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నరాజ్ గిఫ్ట్ షాపును గురువారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ కిషోర్ కు దినదిన వ్యాపార అభివృద్ధి చెందాలని గిఫ్ట్ షాప్ యజమాని కిషోర్ కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమర్చంద్, సంజీవరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఎండి ఇబ్రహీం, కమిటీ సభ్యులు జి ప్రసాద్ శ్రీధర్ రావు, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, సి కె రెడ్డి మూర్తి, జి.రవికుమార్, సునీల్ పటేల్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



## వీరత్వానికి ప్రతీక, ఎందరికో స్ఫూర్తి మన ఛత్రపతి శివాజీ

**తెల్లాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన : కాట శ్రీనివాస్ గౌడ్**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):**

ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని తెల్లాపూర్ లోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి గురువారం పూలమాల వేసి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహరాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా నైపుణ్యం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ స్వరాజ్య స్థాపన కోసం చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని, సమాజంలో న్యాయం, ధర్మం కోసం పోరాడిన మహనీయుడిగా ఆయనను స్మరించుకోవాలని అన్నారు.

## పార్టీ విప్ ధిక్కరించిన కాంగ్రెస్ కౌన్సిలర్ ఎన్నిక రద్దు చేయాలి

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):**

కాంగ్రెస్ పార్టీ జారీ చేసిన విప్ ధిక్కరించిన ఇస్నాపూర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఎన్నిక రద్దు చేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి జిల్లా ఎన్నికల అధికారికి పిర్యాదు చేశారు. మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపికకు ముందే తాము జారీ చేసిన పార్టీ విప్ ను ధిక్కరించిన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ 8వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల మాధవిరెడ్డి అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి జిల్లా ఎన్నికల అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్ కౌన్సిలర్లకు జారీ చేసిన విప్ కు విరుద్ధంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మోతె సుమలత చైర్మన్ కావడానికి మద్దతు ఇచ్చారని ఆ లేఖలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రలోభాలకు మాధవి లొంగిపోయారని, బిఆర్ఎస్ పార్టీ మద్దతుతోనే మాధవి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయ్యారన్నారు. చట్టపరంగా ఎన్నికకు ముందు జారీ చేసిన విప్ ను ధిక్కరించారని అందుకు ఆధారాలు ఉన్నాయని లేఖలో వివరించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన కౌన్సిలర్ మాధవి సభ్యత్వం రద్దు చేయాలని జిల్లా ఎన్నికల అధికారికి నిర్మలా జగ్గారెడ్డి పిర్యాదు చేశారు.



దుర్గానగర్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## రూ. 2.18 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ శంకుస్థాపన లు

**బుద్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

మైలావుపల్లి డివిజన్ దుర్గానగర్, లక్ష్మీగూడ, మధుబన్ కాలనీలలో రూ.2.13 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలన్నదే తన ఉద్దేశ్యం అన్నారు. ప్రతి కాలనీలో మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానన్నారు. సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్త శుద్దితో పనిచేస్తుందన్నారు. పనులలో జాప్యం లేకుండ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అం దుబాటులోకి తీసుకురావాలన్నారు. అన్ని వేళలలో ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేసా బినన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రారంభమైన అగ్రి యూత్ ఫెస్ట్

**బుద్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలం గాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం అగ్రి యూత్ ఫెస్ట్ 2025-26 ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డాక్టర్ రమణారావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం యాకాద్రి, డీన్ అఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి , పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ కెబి ఈశ్వరీ, రాజేం ద్రనగర్, సిరిసిల్ల వ్యవసాయ కళాశాలల అసోసియేట్ డీన్లు డాక్టర్ ఎం గోవర్ధన్, డాక్టర్ సునీతా దేవీలు ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, అవిష్కరణాత్మక ఆలోచనలు పెంపొందించడానికి ఇటు వం టి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రీన్ ఎక్స్ పో ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణ, హరిత సాంకేతికతలు, సుస్థిర వ్యవసాయ విధానాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలను అతిధులు పరిశీలించి అభినందించారు.

# రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో విద్యకు 20 శాతం బడ్జెట్ కేటాయించాలి

## పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు, విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం):**

రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్ లో విద్య కు 20 శాతం నిధులు కేటాయించాలని అపుడే వారిది ప్రజాపాలన ప్రభుత్వం అవుతుందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు, విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్రం లో స్థానిక స్కాలర్స్ పాఠశాల గ్రౌండ్ లో సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థి గర్జన బహిరంగ సభ లో ఆయన ఆన్ లైన్ లో విద్యార్థులను ఉద్దేశించి ప్రశంసించారు, ఈ సమావేశానికి సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హై కోర్ట్ న్యాయవాది సాదిక్ అలీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం లో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కొఠారి కమిషన్ విద్యకు 30 శాతం నిధులు మొత్తం బడ్జెట్ లో కేటాయించాలని చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 75ఏళ్ళు గా పట్టించుకోకుండా ప్రజలను మోసం చేసుకుంటూ వస్తున్నాయన్నారు. ఇప్పుడు పౌర సమాజం గట్టిగా ప్రశ్నిస్తే ఎదో 2 నుండి 3 శాతం నిధులు విద్యా రంగానికి పెంచుతూ తాము విద్యా రంగానికి పెద్ద పీఠ వేస్తున్నామని గొప్పలు చెప్పడం సబబు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సభకు ముఖ్యఅతిథి గా పాల్గొన్న విద్యా పరిరక్షణ రాష్ట్ర నాయకులు ఏ. నర్సింహా రెడ్డి



మాట్లాడుతున్న సాదిక్ అలీ

మాట్లాడుతూ విద్యా రంగానికి బడ్జెట్ అతి తక్కువ కేటాయించడం చాలా దుర్మార్గమైన విషయంగా అభివర్ణించారు. పాలకులకు విద్యార్థులే బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. తాను 50 ఏండ్లు గా ప్రభుత్వం విద్యా విధాన నిర్ణయాల విషయం లో ప్రత్యక్షం గా పరోక్షంగా గా సాక్షి గా వున్నానని అయితే ఏ ప్రభుత్వం కూడ విద్యా రంగానికి ఎక్కువ నిధులు ఇచ్చిన దఖాలాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి గర్జన సభను ఉద్దేశించి జనగామ మాజీ శాసన సభ్యులు సిహెచ్ రాజా రెడ్డి మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యత ను నేటి పాలకులు గుర్తుంచడం లో విఫలం అయ్యారని, ఇప్పటికైనా గుర్తుంచి విద్యకు 20 శాతం బడ్జెట్లో నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థి గర్జన సభ ఎదో నామ మాత్రంగా జరగడం లేదని, ఒక వేల విద్య కు ఈ సారి తక్కువ నిధులు కేటాయిస్తే జనగామ నుంచే విద్యా పరిరక్షణ ఉద్యమం తీవ్ర రూపం తాళస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన సాదిక్ అలీ మాట్లాడుతూ తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయక ముందు తాము పౌర సమాజం తరపున భారత్ జోడో యాత్ర లో రాహుల్ గాంధీ తాము తెలంగాణ లో అధికారం లో వస్తే విద్య కు, వైద్యా నికి అత్యధిక నిధులు ఇస్తామని చెప్పి ఇప్పుడు మొండి చేయి చూపడం సబబు కాదని, తాము ఈ సారి బడ్జెట్ లో విద్య కు 20 శాతం నిధులు కేటాయించక పోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. విద్యా గర్జన కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్పించాలని ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. సమావేశం లో జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళం పల్లి రాజు, దళిత రత్న,డాక్టర్ రాజమౌళి, జరసం బాద్యులు జి కృష్ణ , ఏకశిల ప్రిన్సిపాల్ నళిని పలు విద్యా సంస్థ ల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, వేల సంఖ్య లో విద్యార్తిని విద్యార్థులు పాల్గొన్నారు.



# పేదలకు సొంత ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## అలాంటి కలను సాకారం చేసింది మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

**కొత్తకోట, ఫిబ్రవరి 19 ( ప్రభాత ఉదయం)**

గూడు లేని ప్రతి పేదవాడికి గృహ వసతి కల్పించటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మదనాపూరం మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు.గురువారంకొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు గుడిసె నారమ్మ ఇంటి భూమి పూజ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ పల్లెపాగు ప్రశాంత్ , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేస్త్రి కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రగతి, పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతుందన్నారు . ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఎన్ జే. బోయెజ్ పి రవీందర్ రెడ్డి , ఎం సంజీవుడు , కొత్తకోట మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి , మైనారిటీ నాయకులు ముజీబ్ , కాంగ్రెస్ సీనీయర్ నాయకులు ఎం భాస్కర్ జెకె.రాజు ,జె.కృష్ణయ్య ,శాంతులు .జె . శ్యామ్ , కె.దిలీప్ , జె. కర్ణ కుమార్ , యూత్ నాయకులు కొమ్ము అనిల్ , చింటూ , ఇస్సాక్, చిన్నులి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆలోచించే పార్టీ బీఆర్ఎస్: ఎర్రోళ్ల యాదయ్య

**బుద్వేల్, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**



అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి , సంక్షేమం కోసం ఆలోచించే పార్టీ బీ ఆర్ ఎస్ పార్టీ అని గగన్ పహాడ్ కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ కే దక్కుతుందన్నారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, కే సీ ఆర్ కిట్టు లాంటి పథకాలతో పాటు అన్ని మతాల పండుగలకు ప్రోత్సాహకాలు అందచేసిన ఘనత బీ ఆర్ ఎస్ కే దక్కుతుందన్నారు. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్తు, ప్రతి ఇంటికి త్రాగు నీరు ఇచ్చిన మహనీయుడు కే సీ ఆర్ అని గుర్తు చేశారు. నగరం అభివృద్ధి చెందిందంటే అది బీ ఆర్ ఎస్ హయాంలోనే అన్నారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో ప్రజలు బీ ఆర్ ఎస్ పార్టీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.




# ఛత్రపతిని ఆదర్శంగా తీసుకోవాలి

## మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్,హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రత్నసింహారెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**

హిందూ సామ్రాజ్య స్థాపన కోసం ఛత్రపతి శివాజీ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కొనియాడారు.ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని గద్వాల్ జిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షులు బైరెడ్డి మధు, పల్లెరాజు ఆధ్వర్యంలో గద్వాల పట్టణం బీరెల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ.. యువత ఛత్రపతి శివాజీ వ్యక్తిత్వాన్ని, ఆయన పోరాటాలకు సంబంధించిన చరిత్రను చదివి స్ఫూర్తి పొందాలన్నారు. దివ్య రంజిత్కుమార్ మాట్లాడుతూ.. యువత అన్ని మతాల వారిని గౌరవిస్తూనే సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. నిత్యం ఎంతో మంది రక్తం దొరకక తనువు చాలిస్తున్నారని.. ప్రతి ఒక్కరు ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ౬7వ వార్డు కౌన్సిలర్ టిఎన్అర్ జగదీష్,2వ వార్డ్ పెద్దలు కుర్వ శేఖర్, శ్రీరామ్,ధాబా సూరి,నర్సింహా, సంఘాల పవన్, వాసు,రామకృష్ణ పరిరక్షణ సమితి నాయకులు, కాలనీ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.




# ఇంటర్మీడియట్-2026 పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి

## ఇంటర్మీడియట్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అకాడమిక్ అండ్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వర్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**

ప్రభుత్వ జూనియర్ కళాశాల కో ఎడ్యుకేషన్ గద్వాలలో ఐపిఈ –2026 పరీక్షల నిర్వహణ కొరకు చీఫ్ సూపర్ డెంట్లకు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లకు, సిట్టింగ్స్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్కు కు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అకాడమిక్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని చీఫ్ సూపర్డెంట్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్లను కోరినారు. ఫిబ్రవరి 25 నుండి మార్చ్ 16 వరకు జరిగే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో 8,471 మంది విద్యార్థులు పరీక్షల కు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 4,366 సెకండ్ ఇయర్ 4,105 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు,డిపార్ట్మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్లను కఠినమైన నిఘా పెట్టాలని తెలి పారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం హృదయ రాజు మాట్లాడుతూ... స్ట్రాంగ్ రూము ను పోలీస్ స్టేషన్ లోనే ఏర్పాటు చేశామని తెలిపారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని,పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరినారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మరియు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి, యం .హృదయ రాజు, ఇంటర్మీడియట్ జోగులాంబ గద్వాల జిల్లా పరీక్షల నిర్వహణ సభ్యులు బండ్ల దేవేందర్ రెడ్డి , పద్మావతి, ప్రిన్సిపల్స్ వీరన్న , కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజలకు నాణ్యమైన నీటి సరఫరా అందించాలి

## జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్

## హైదరాబాద్ రీజియన్ పరిధిలో జలమండలి జేఎమ్ డీ పర్యటన

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్ హైదరాబాద్ రీజియన్‌లోని గోషామహల్ ఏరియా, కార్వాన్ సర్కిల్ పరిధిలో పర్యటించారు. మొదటగా జియాగూడా ప్రాంతంలో కలుషత నీటి ఫిర్యాదుల పరిష్కార పనులను పరిశీలించారు. కలుషత నీటి ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన నీటి సరఫరా , సమర్థవంతమైన మురుగు పారుదల సేవలు అందించడంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జేఎండీ అధికారులకు సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదులు, ట్యాంకర్‌ల నిర్వహణపై సమగ్రంగా అధికారులతో సమీక్షించారు. ఎంసీసీ ద్వారా అందిన ఫిర్యాదులలో సీవరేజ్ ఓవర్‌ఫ్లోలు, కలుషిత నీటి ఫిర్యాదులు, మిస్సింగ్ మాన్‌హోల్ కవర్లు, దెబ్బతిన్న మాన్‌హోల్ కవర్లపై సమీక్షించి పురోగతి అడిగి తెలుసుకున్నారు. మెట్రో కస్టమర్ కేర్ కు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ వినోద్ భార్గవ, జీఎంలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



కమిషనర్ ను కలిసిన కౌన్సిలర్

# మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన

## 3వ వార్డు సిపిఎం కౌన్సిలర్ బూడిది జ్యోతి గోపి

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం):**

జనగామ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డిని, టౌన్ ప్లానింగ్ అధికారి రంగు వీరస్వామి ని మర్యాదపూర్వకంగా కలిసిన 3వ వార్డు సిపిఎం కౌన్సిలర్ బూడిది జ్యోతి గోపి. అలాగే మున్సిపల్ మేనేజర్ గజ్జల రాములు శానిటేషన్ ఇన్స్పెక్టర్ గోపయ్య, టిపిబిఓ పవన్ కుమార్, రెవెన్యూ విభాగం ఆర్ఐ కృష్ణ వాసు ను,కార్యాలయ అన్ని విభాగాల అధికారులను సిబ్బందిని కలిసి భవిష్యత్తులో వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.





# గద్వాల జిల్లా కేంద్రంలో ఘనంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**

ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగిన రోజు సందర్భంగా హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని గురువారం గద్వాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణంలో విశ్వహిందు పరిషత్,భజరంగ్ దళ్, శంభూనాథ్ యువసేవక్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి శోభయాత్రను నిర్వహించారు. స్థానిక వేదానగర్ లోని శంభూనాథ్ మఠం నుంచి ప్రధాన వీధుల మీదుగా చేపట్టిన శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో శివాజీ విగ్రహాన్ని ఊరేగించారు. భగవత్ ధ్వజాలను చేతబూనిన యువకులు దేశభక్తి నినాదాలతో హోరెత్తించారు. దేశభక్తి పాటలపై ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పలువురు వక్తలు ఛత్రపతి హిందూ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రజాపతినిధులు, నాయకులు, హిందుబందువులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూహెచ్-జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొడెం సాయి కృష్ణ

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

జేఎన్టీయూహెచ్ఉజేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి కొడెం సాయి కృష్ణ ని నియమించినట్లు జేఎన్టీయూహెచ్ఉ జేఏసీ చైర్మన్ డా. మంద రంజిత్ కుమార్ గురువారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమర్థంగా స్పందిస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కొడెం సాయి కృష్ణ నాయకత్వం వహిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామక ఉత్తర్వులు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అమల్లో ఉంటాయని, అలాగే ఈ రోజు నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొడెం సాయి కృష్ణ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని బాధ్యతాయుతమైన పదవులు అలంకరించి సంఘానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.



# సంపూర్ణత అభియాన్‌లో వంద శాతం లక్ష్యాలను సాధించాలి

## ప్రోగ్రామ్ సెంట్రల్ ప్రబారి అధికారి మానస గంగోత్రి కాట





**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)**

సంపూర్ణత అభియాన్ లో నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అస్పిరేషనల్ ప్రోగ్రాం సెంట్రల్ ప్రభారీ ఆఫీసర్ మానస గంగోత్రి కాట అన్నారు.నీతి అయోగ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ ప్రోగ్రాం కు గట్టు మండలం ఎంపికైన నేపథ్యంలో గురువారం ప్రోగ్రాం సెంట్రల్ ప్రబారి ఆఫీసర్ మానస గంగోత్రి కాట జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తో కలిసి గట్టు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. గట్టు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం సమావేశపు మందిరంలో పలువురు జిల్లా, బ్లాక్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రోగ్రామ్ సెంట్రల్ ప్రబారి అధికారి మానస గంగోత్రి కాట మాట్లాడుతూ ప్రోగ్రాంలో భాగంగా సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమం జనవరి 28న ప్రారంభించడం జరిగిందని ఏప్రిల్ 14 వరకు కొనసాగుతుందన్నారు. పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే కాక ప్రోగ్రామ్ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా ముందుకెళ్లాలన్నారు. అక్షరాస్యతపరంగా వెనుకబడ్డ గట్టు మండలంలో విద్యారంగంలో ప్రగతి సాధించడమే కాక మిగిలిన అన్ని రంగాల్లో పురోగతి సాధించడమే ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ ప్రధాన ఉద్దేశం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రుణాలను ఇక్కడి ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం విజయవంతం చేసేందుకు మరో సమావేశం నిర్వహించేనాటికి 100% లక్ష్యాలను సాధించేందుకు సంబంధించిన శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ గతేడాది ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో చూపిన ప్రతిభకు జాతీయ స్థాయిలో ఐదు, దక్షిణ భారతదేశ స్థాయిలో రెండో స్థానం సాధించినట్లు చెప్పారు. ఈ ప్రతిభకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.కోటి నిధులు సాధించడమే కాక రాష్ట్ర గవర్నర్ నుంచి ప్రశంసలు అందుకున్నట్లు పేర్కొన్నారు. సంపూర్ణత అభియాన్ 2.0 లో కూడా నిర్దేశించిన అంశాల్లో 100% లక్ష్యాలను సాధించేలా సంబంధిత అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం లో ఉన్న 39 అంశాల్లో ప్రధానంగా విద్య, పౌష్టికాహారం, వ్యవసాయం, ఆరోగ్యం, పశువైద్యం, తదితర విషయాల్లో పూర్తిస్థాయిలో ప్రగతి సాధించాల్సి ఉందన్నారు. అనంతరం సంపూర్ణత అభియాన్ 2.0 కు సంబంధించిన గోడపత్రికలను అధికారులు విడుదల చేశారు. అలాగే జేఈఈ మెయిన్స్ కు అర్హత సాధించిన ఇంటర్ గురుకుల విద్యార్థులను సన్మానించారు.అంతకుముందు సెంట్రల్ ప్రబారి ఆఫీసర్ మానస గంగోత్రి జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తో కలిసి ఆలూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పలు తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు, ఫలితాలు, మధ్యాహ్న భోజనం మెనూ, తదితర విషయాలపై మాట్లాడారు. పలువురు విద్యార్థులతో పాఠాలు చదివించి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లను పరిశీలించి, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారిని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ప్రహారీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.పెంచికలపాడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి చిన్నారులకు, గర్భిణీ, బాలింతలకు అందజేసే పౌష్టికాహారంను తనిఖీ చేశారు. చిన్నారుల బరువు, ఎత్తు ప్రతినెల క్రమం తప్పకుండా కొలిచి నిర్దేశిత యాప్ లో, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డులో వివరాలను నమోదు చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇంటికి ఇచ్చే గుడ్లు సకాలంలో అందజేయాలని, ఇంటి వద్ద సరైన పౌష్టికాహారం తీసుకునేలా గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. గట్టు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులు 100% ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలన్నారు. చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు తిరిగి చదువుకునేలా కృషి చేయాలని అక్కడి అధికారులను ఆదేశించారు. గట్టు జడ్పిహెచ్ఎస్ లో భవిష్య భారత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన బాలికల మరుగుదొడ్లను ప్రారంభించారు. సేవా సంస్థ పంపిణీ చేసిన సైకిళ్లను పరిశీలించారు. శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 13 ల్యాప్టాప్స్ అందజేశారు. చివరగా ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ సెంట్రల్ ప్రబారి అధికారి మానస గంగోత్రి గట్టు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా విద్యాశాఖ అధికారిని విజయలక్ష్మి, డిడబ్ల్యూఓ సునంద, డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, పంచాయతీరాజ్ డిఇ లక్ష్మణ్, గట్టు మండల తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో చెన్నయ్య, ఎంఈఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల మండల అధికారులు, ఆయా విద్యాసంస్థల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభం

# కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రత్యేక చొరవతో అమ్మల చెంతనే చిన్నారులు

### కలెక్టరెట్‌లో శిశు సంరక్షణ కేంద్రం

### చిన్నారుల తో ప్రారంభించిన కలెక్టర్, డీసీపీ

### సంతోషాన్ని వ్యక్త పరుస్తున్న మహిళ ఉద్యోగులు

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం):**

చిన్నపిల్లలు ఉన్న మహిళలు ఆఫీసులకి వెళ్లాలంటే తమ పిల్లల్ని నెలకు వేల రూపాయలను ఖర్చు చేస్తూ, .డే కేర్ సెంటర్ లో వదిలి వెళ్లడం మనం చూస్తూనే ఉంటాం, అంతా ఖర్చు చేసిన కూడా అక్కడ తమ పిల్లలు ఎలా ఉన్నారో అని, అమ్మ మనసు టెన్షన్ పడక తప్పదు. మరి కొంత మంది మహిళా ఉద్యోగులు తమ పిల్లలను అమ్మమ్మ, నానమ్మ దగ్గర వదిలి రావడం తప్పని పరిస్థితి, విధుల్లో నిమగ్నం అయినప్పటికీ పాపం ఆ తల్లి మనసు తమ చిన్నారి మీదకు లాగకుండా ఉండదు, ఆలాంటి తల్లుల బాధ ను తీర్చాలని వారు పని చేస్తున్న ఆఫీస్ లోనే తమ బిడ్డలను చూసుకునే వెసులుబాటు కల్పించాలన్న కలెక్టర్ ఆలోచన వల్ల కార్పొరేట్ స్థాయి లో ఉన్న ఈ అవకాశం ఇప్పుడు జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల్లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు కూడా లభించింది.5 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న పిల్లలను మహిళా ఉద్యోగులు ఆఫీస్ కి వచ్చేటప్పుడు తమ తో పాటు తమ చిన్నారులని కూడా తీసుకవచ్చి వారిని సంరక్షించేందుకు కలెక్టరెట్ లోని గ్రౌండ్ ఫ్లోర్ లోని జి4 లో శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం డీసీపీ రాజా మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. అనంతరం కేంద్రం లో చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన అట వస్తువుల పరికరాల్లో చిన్నారులు సంతోషం గా ఆడటం చూసి కలెక్టర్, డీసీపీ సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్బంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ చిన్న పిల్లలు ఉన్న మహిళా ఉద్యోగులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులని ఎప్పటికప్పుడు పరిశుభ్రం గా పెట్టాలని, చిన్నారులని జాగ్రత్త గా చూసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు కలెక్టర్ తెలిపారు. ఆట వస్తువుల తో పాటు...చిన్నారులు ఏదైనా నేర్చుకునేలా బొమ్మల పుస్తకాలు, పలకలు, పెన్సిల్స్, డ్రాయింగ్స్ వస్తువు లు మొదలైన వాటిని కూడా కేంద్రం లో అందుబాటులో పెట్టాలన్నారు. తమ పిల్లల కోసం ఇంతగా అలోచించి... మేము పని చేసే చోట వద్దనే మా చిన్న పిల్లలు కూడా ఉండేలా... వారి కోసం ఈ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ కి మహిళా ఉద్యోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పిల్లలు ఎలా ఉన్నారో అనే టెన్షన్ ఇక నుండి ఉండదని మహిళా ఉద్యోగులు తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తున్నారు.ఈ కార్యక్రమం లో ఇంచార్జి డిడబ్ల్యూఓ,కోదండరాములు, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# భూమికి బదులు భూమి ఇవ్వాలి

## లేదా... వేలంలో ప్రభుత్వానికి వస్తున్నట్లు ఎకరాకు రూ. 150 కోట్లు ఇవ్వాలంటున్న రైతులు



మూసీ సుందరీకరణలో భూములు కోల్పోతున్న తమకు భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరుతున్న రైతులు..





రైతు ఎం రాజ మల్లయ్య...



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త మ్యాడమ్ మధుసూదన్

**బుద్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

మూసీ సుందరీకరణ కోసం భూముల సేకరణ అంశాలను వివరిస్తు గురువారం హైదర్ గూడ గాంధీ విగ్రహం వద్ద రెవెన్యూ, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అధికారులు గ్రామ సభ నిర్వహించారు. రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ బొమ్మ రాములు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు తహసీల్దార్ అనిల్ కుమార్ లు ఈ గ్రామ సభ లో పాల్గొన్నారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం సేకరించనున్న భూసేకర కు సంబందించి ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిన నేపద్యంలో గ్రామ సభల ద్వారా ఆ వివరాలను భూములు కోల్పోతున్న రైతులకు తెలియజేయడానికి ఈ గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు రాజేంద్రనగర్ మండలంకు చెందిన రెవెన్యూ పరిధిలో ఎనబై నుంచి తొంబై మందికి చెందిన 31 ఎకరాల 31 గుంటల భూములు గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం సేకరించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూసీ పరివాహక ప్రాంతాలలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వం వేలం వేస్తే ఎంత వస్తుందో అంత మొత్తాన్ని రైతులకు ఇవ్వాలి: మోంద్ర రాజమల్లయ్య, రైతు, హైదర్ గూడ: కోకాపేట్ తదితర ప్రాంతంలో ప్రభుత్వ భూమిని వేలం వేస్తే రూ.150 కోట్లు వచ్చిందని, హైదర్ గూడ లో మూసీ సుందరీకరణ కు రైతుల నుంచి భూములు తీసుకుంటున్న ప్రభుత్వం అంతే మొత్తంలో రైతలుకు ఇవ్వాలి. మా కుటుంబం అంతా తమకు ఉన్న భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ప్రభుత్వం భూ సేకరణ రేటు ఏ విదంగా ఉంటే ఆ విదంగా రైతులకు చెల్లిస్తామంటే ఒప్పుకోం. మార్కెట్ రేటు ప్రకారం గజం రూ. 1.3లక్షలు పలుకుతుందని అంతే మొత్తం ఇవ్వాలి.

**భూమికి బదులు ఔటర్ రింగ్ రోడ్డు లోపల భూమి ఇవ్వాలి కొలన్ సుభాష్ రెడ్డి**

మూసీ సుందరీకరణ కోసం కోట్లాది రూపాయల విలువ చేసే భూములను తీసుకుంటున్న ప్రభుత్వం భూమి కి బదులు ఔటర్ రింగ్ రోడ్డు లోపల భూమిని ఇవ్వాలి. లేకుంటే భూములు కోల్పోయిన వారికి నష్టం జరుగుతుంది.

భూమికి బదులు భూమి ఇస్తేనే మేలు : మ్యాడం మధుసూదన్, సామాజిక కార్యకర్త

భూమి కి బదులు భూమే ఇవ్వాలి. తరతరాలకు భూమిని నమ్ముకుని జీవిస్తున్న రైతులకు న్యాయం చేయాలి. అలా కాదంటే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచిం చాలి

ప్రజలకు మేలు చేసే విదంగా భూసేకరణ ఉండాలి : ఎన్ మల్లారెడ్డి, బీజేపీ నాయకులు

మూసీ సుందరీకరణ చేస్తాం అంటున్న ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే విదంగా భూ సేకరణ చేయాలి. రైతులకు అన్యాయం చేసి మూసీ అభివృద్ధి చేస్తామం అంటే మంచి పద్దతి కాదు. ఆ భూముల పై ఆధారపడి ఉన్న వారి గురించి ఆలోచన చేయాలి.





# కళాశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థినీ మృతి


**బుద్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం)**

కాలేజీ లో ఇంగ్లీష్ ప్రీ ఫైనల్ పరీక్షలు రాసిన ఓ 17 సం వత్సరాల బాలిక మూడంతస్థుల పై నుంచి క్రిందికి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాలను రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ వెల్లడించారు. శివరాంపల్లి ఎన్ పీ ఏ కాలనీ కి చెందిన శైలేష్ తివారి కుమార్తె రితిక తివారి బవానీ కాలనీలో గల శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ సెకండ్ ఇయర్ చదువుతుంది. గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు కళాశాల కు వచ్చి ప్రీ ఫైనల్ పరీక్ష రాసింది. అనంతరం కాలేజీ పైకి వెళ్లింది. అక్కడి నుంచి క్రిందకు దూకుతుండగా, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, తోటి విద్యార్థులు వద్దని వారించారు. అయినా ఆ బాలిక వినకుండ మూడంతస్థుల భవనంపై నుంచి క్రిందకు దూకింది. అప్పటికే క్రింద గుమి గూడిన కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది పై నుంచి దూకిన అమ్మాయిని కాపాడటానికి విశ్వ ప్రయత్నం చేశారు. పై నుంచి దూకిన అమ్మాయిని చేతులపై ఆపడానికి ప్రయత్నించారు. మూడవ అంతస్తు పై నుంచి దూకడంతో ఆ వేగానికి వారు ఆ బాలికను ఆప లేక పోయారు. తీవ్ర గాయాలకు గురైన బాలిక ను స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతు ఆ బాలిక మరణించిందని ఇన్స్ పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపారు. రితిక తివారి ఎందుకు. కళాశాల భవనంపై నుంచి క్రిందకు దూకిందో తెలియరాలేదు. బాలిక తల్లిదండ్రులు కూడా ఇంకా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, కూతురు మరణించిన బాధలోనే వారు ఉన్నారని ఇన్స్ పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపారు. క్రిందకు దూకిన బాలిక బాగానే చదువుతుందని కళాశాల యాజమాన్యం తెలిపారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులను కలిసిన నూతన మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు



కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్



డిసిపిను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్



ఆర్డీవోను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం):**

జనగామ లో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన కౌన్సిలర్ లు, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, కౌన్సిలర్లు రామగళ్ళ విజయ్ కుమార్, నీరటి రజిని, వంగ ఉమా, అండాలు, దోర్నాల అనిత, పాముకుంట్ల ప్రసాద్ చెంచారపు కరుణాకర్ రెడ్డి లు జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సూచన మేరకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డిసిపి రాజమహేంద్ర నాయక్, జనగామ ఆర్డీవో గోపిరామ్ లను మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బోనసి క్రాంతి, రంగరాజు ప్రవీణ్, దోర్నాల వెంకటేశ్వర్లు, వంగ యుగంధర్, కడమంచి రమేష్, వాసు, సురేష్ రెడ్డి, రాజు, మహేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608